క్లుప్తంగా

రామాలయంలో ఆర్డీఓ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ టౌన్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రెడ్డి కాలనీలో గల కోదండ రామాలయంలో బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రేపాల పురుషోత్తంరెడ్డి, ఆలయ కమిటీ కోశాధికారి పుట్ట దయాకర్‌రెడ్డి ఉన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణ

త్రిపురారం : మండలంలోని చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి సత్యనారాయణ పీఆర్‌టీయూ త్రిపురారం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బుధవారం సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల పక్షాన సీపీఐ పోరు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కొండమల్లేపల్లి : బడుగు, బలహీన వర్గాల పక్షాన సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సోమ్లానాయక్, శేఖరాచారి, కె.చరణ్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం



మంచి నీటిని పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

దేవరకొండ : రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయనున్నట్లు క్లబ్ దేవరకొండ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ తెలిపారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ఖిలా సందర్శనకు వచ్చే వారి దాహార్తిని తీర్చడానికి క్లబ్ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సముద్రాల ప్రభాకర్, వనం భిక్షమయ్య, చీదెళ్ల వెంకటేశ్వర్లు, శ్యాంసన్, నీల బుచ్చయ్య, వనం శ్రీను ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత విస్తర్లు ఆరోగ్యానికి మేలు

రామగిరి(నల్లగొండ): ప్లాస్టిక్ రహిత విస్తర్లులతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో చెట్ల ఆకులతో ఇస్తరాకుల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మోదుగు, అడ్డ ఆకులతో తయారైన పర్యావరణహితమైన ఇస్తరాకుల్లో తింటే అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు నెర్మట లక్ష్మి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, సురేష్‌గుప్తా, సాయి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీ శ్రీ కృష్ణ ఆలయంలో ఆగస్టు 26వ తేదీన జరగనున్న శ్రీ కృష్ణ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజిరెడ్డి, కమిటీ సభ్యులు పరమేష్, కర్నె వరప్రసాద్, నాగరాజు, జిల్లపల్లి యాదయ్య, రఘురాంరెడ్డి, జనిగల రాములు, సిరిగిరి వెంకట్‌రెడ్డి, నిర్మల, రజిత, సువర్ణ, పూజారి ఆచార్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాల ఆచరింపు



మిర్యాలగూడ: కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద భక్తుల కోలాహలం



మిర్యాలగూడ: సాయిబాబా ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మిర్యాలగూడ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దామరచర్ల మండలంలోని వాడపల్లిలో కొలువైన శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వాడపల్లికి చేరుకుని కృష్ణా, మూసీ సంగమం వద్ద స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయశాఖ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించారు. కృష్ణా, మూసీ సంగమం వద్ద అధికారులు గజ ఈతగాళ్లను నియమించారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం తొలి ఏకాదశ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో వ్రతాలు ఆచరించారు.

దేవరకొండ: తొలి ఏకాదశి వేడుకలను బుధవారం దేవరకొండలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుండే పట్టణంలోని ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని ఖిల్లాకు చుట్టు పక్కన ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో మహిళలు, భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

హాలియా : తొలి ఏకాదశి వేడుకలను బుధవారం అనుముల మండలంతోపాటు హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. తొలి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి పూజలు, అర్చనలు, తమలపాకులతో అభిషేకాలు నిర్వహించారు.

పెద్దవూర: హిందువులకు తొలి పర్వదినమైన ఏకాదశిని బుధవారం మండలంలోని అన్ని గ్రామాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని బట్టుగూడెం గ్రామంలోని ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శివుని విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. సంగారంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు నిర్వహించి వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిమ్మల సాయిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సైదులు, చిరంజీవి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయచంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయం ,సాగర్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, బుచ్చిరెడ్డి, నాయిని రమేస్‌రెడ్డి, బూడిద వెంకటేష్‌యాదవ్, వర్కాల పాండు, బూడిద మల్లేష్‌యాదవ్, రాంబాబు ఉన్నారు.

సాగర్ తీరంలోని ఆలయాల్లో..



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

నాగార్జునసాగర్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని బుధవారం సాగర్ తీరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కృష్ణాతీరంలో భక్తులు అభ్యంగనస్నానాలు చేసి కృష్ణమ్మకు పసుపు,కుంకుమలు వాయినమిచ్చారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాశయం తీరంలోని కాత్యాయిని సమేత శ్రీఏలేశ్వర మల్లికార్జునస్వామి, సత్యనారాయణ స్వామి, పైలాన్‌లోని రామాలయం, సాయి ఆలయం, మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి వ్రతాలు ఆచరించారు.

చందంపేట : చందంపేట మండలంలోని దేవరచర్లలోని మునిస్వామి ఆలయం బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. పురాతనమైన శివాలయం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.





మిర్యాలగూడ మండలం తుంగపాడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు



కొండమల్లేపల్లి : అయ్యప్పస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



దేవరకొండ : ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



దేవరకొండ : మల్లికార్జున స్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు



పెద్దవూర: సంగారంలో అన్నదానం చేస్తున్న భక్తులు

రుణమాఫీ హర్షణీయం

వేములపల్లి: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు పుట్టల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం రైతు వేదికలో నిర్వహించే రుణమాఫీ సంబురాల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రైతువేదికలో సంబరాలు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద గల రైతువేదికలో గురువారం రుణమాఫీ సంబరాలు జరుపుకోనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పాండు తెలిపారు. మండలంలో రుణమాఫీ పొందిన రైతులు మధ్యాహ్నం 3గంటలకు హాజరుకావాలని కోరారు.

30న 'చలో అసెంబ్లీ'

మిర్యాలగూడ : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశ వర్కర్స్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మహేశ్వరి తెలిపారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్లకు రూ.18వేల కనీస వేతనంతోపాటు పరీక్ష రాసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికై గురువారం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ గ్రూప్ సభ్యుల ప్రమాణ స్వీకారం



నూతనంగా ఎన్నికైన లయన్స్‌క్లబ్ గ్రూప్ సభ్యులు

మిర్యాలగూడ : లయన్స్‌క్లబ్ ఆఫ్ తరుణ, భాస్కర, చైతన్య జన సేవాసంఘం, దివ్యాంగ, వనిత డైమండ్ క్లబ్‌ల నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం పట్టణంలో నిర్వహించారు. తరుణ అధ్యక్షుడిగా క్యామ మల్లేశం, కార్యదర్శిగా సామ శ్రీనివాస్, ట్రెజరీగా సురేందర్‌రెడ్డి, భాస్కర అధ్యక్షుడిగా కె.రాంరెడ్డి, కార్యదర్శిగా ఆనంద్‌కుమార్, ట్రెజరీగా పింకిశర్మ, సీజేఎస్ఎస్ దివ్యాంగ అధ్యక్షుడిగా సంగు రాంబాబు, కార్యదర్శిగా గట్టు వెంకటేశ్వర్లు, ట్రెజరీగా శంకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తీగల మోహన్‌రావు, కేవీ.ప్రసాద్, కేఎస్.ప్రసాద్, శివశంకర్‌రావు, మురళీధర్‌రావు, మురహరి, భాగ్యలక్ష్మి, సతీష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, మాశెట్టి శ్రీనివాస్, సుందరి నాగయ్య, సాధినేని శ్రీనివాస్‌రావు, ముత్త మానస, కర్నాటి రమేష్, వెంకటరమణ, డాక్టర్ రాజు, జయ, బాలమణి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు ఉపయోగించుకుంటాం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామీణ వైద్యులు, ఎమ్మెల్యే

మిర్యాలగూడ అర్బన్: ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీల శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్ ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని హర్షిస్తూ బుధవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామీణ వైద్యులను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించే శిక్షణను గ్రామీణ వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు ఎండి.మునీర్, శ్రీనివాస్ బాబు, కృష్ణమూర్తి, రాంబాబు, అంజిబాబు, గోవర్ధన్‌చారి, మల్సూర్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వేములపల్లి (మాడ్గులపల్లి): గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్ అందజేస్తామని ప్రకటించడం పట్ల మాడ్గులపల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం గ్రామీణ వైద్యులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానిమియా, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు మాట్లాడారు. కార్యక్రమంలో పగిడిమర్రి గోవర్ధనచారి, షేక్ రసూల్, నూకపంగ శ్రీనివాస్, నిమ్మల వెంకన్న, నాగేందర్, లక్ష్మణ్, రమణ, గడ్డమీది సైదులు, కవిత, భాస్కర్‌రావు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

శాలిగౌరారం: ఆయిల్‌పామ్ సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని నకిరేకల్ డివిజన ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. మండలంలోని శాలిలింగోటంలో సురేశ్ రైతు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చన్నారు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: రైతు రుణమాఫీ చరిత్రాత్మకం అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు రుణమాఫీకి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురువారం రూ.లక్ష లోపు రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం వడ్డీలకే రుణమాఫీ పరిమితం అయ్యిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి నాలుగు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి, కుర్మేడ్, పీఏపల్లి మండలం మేడారం ,దేవరకొండ మండలం గాజీనగర్‌కు ఒకటి చొప్పున సబ్ స్టేషన్‌లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీ సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, ఎండి యూనూస్, వడ్త్య దేవేందర్, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, రమేష్ ఉన్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు



నియామకపత్రం అందుకుంటున్న నాగరాజు

వేములపల్లి (మాడ్గులపల్లి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా మాడ్గులపల్లికి చెందిన అప్పల నాగరాజు నియమితులయ్యారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని నాగరాజు పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. మొహర్రం



పెద్దవూరలో పీర్ల ఊరేగింపు



సాగర్‌లోని పైలాన్‌కాలనీలో..

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : మత సామరస్యానికి ప్రతీకగా పీర్ల పండుగ నిలుస్తుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో పీర్ల పండుగలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చింతపల్లి సుభాష్, లింగంయాదవ్, పంగ లాలయ్య, రమావత్ తులసీరాం,ఇస్మాయిల్, కోటేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మొహర్రం పండుగను బుధవారం మండలంలోని చింతలపాలెం, అల్వాల, రాజవరం, నేతాపురం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. డప్పు, వాయిద్యాలతో పీర్లను ఎత్తుకొని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

డిండి: మండల వ్యాప్తంగా బుధవారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు పీర్లకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అయా గ్రామాల్లోని మసీదుల వద్ద ఏర్పాటు చేసిన అలావ్ దగ్గర డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను ఆడించారు. కార్యక్రమంలో హబీబ్, రహీమాన్, శ్రీను, లక్ష్మయ్య, సత్తయ్య, రమేష్, ఘనీ, ఉన్నారు.

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి, త్రిపురారం, సత్యనారాయణపురం, రాగడప, అంజనపల్లి గ్రామాల్లో బుధవారం మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు.

నాగార్జునసాగర్: సాగర్‌లో మోహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కులమతాలకతీతంగా స్థానికులు వేడుకలో పాల్గొన్నారు. అనంతరం పీరు ఎత్తుకుని ఊరేగించారు. మూడు రోజులుగా మొదటి సరిగెత్తు, రెండవ సరిగెత్తు నిర్వహించి బుధవారం నిమజ్జనం చేశారు.

పెద్దవూర: మొహర్రం పండుగను బుధవారం మండల కేంద్రంతో పాటు పోతునూరు, పులిచర్ల, ఊట్లపల్లి, గర్నెకుంట గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొమ్మిది రోజులుగా సవార్లు(పీర్ల)ను ప్రత్యేకంగా అలంకరించి ఉపవాస దీక్షలతో పూజలు నిర్వహించి ఏడవ రోజున చిన్న సరిగస్తు, తొమ్మిదవ రోజున పెద్ద సరిగస్తును భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం వేకువజామున సవార్లను ఎత్తుకున్న భక్తులు అగ్ని గుండాల నుంచి వెళ్లారు. గ్రామాల్లో సవార్లను ఇంటింటికి తిప్పుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సవార్లను నిమజ్జనం చేశారు.



కొండమల్లేపల్లి : పీర్ల పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

అద్దెభవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు
- విద్యుత్ ఏఈ కార్యాలయానికి అద్దెభవనం కూడా కరువే..
- నూతన భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి



తిరుమలగిరి : అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు గోదాములో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరిని నూతన మండలంగా ఏర్పాటు చేసినా పరిపాలనకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించలేదు. గత్యంతరం లేక ఇరుకు గదులు, గోదాముల్లో ఉద్యోగులు కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాల ఏర్పాటు అనంతరం మేజర్ పంచాయతీగా ఉన్న తిరుమలగిరిని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు సొంత భవనాలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గోదాములో పోలీస్‌స్టేషన్ నిర్వహణ

మండల కేంద్రంలో ముందుగా గుర్తుకు వచ్చేవి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు. ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దెభవనంలోనే తహసీల్దార్ కార్యాలయాన్ని నడుపుతున్నారు. ఇక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఏళ్ల కింద నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నడుస్తోంది. పోలీస్‌స్టేషన్ ధాన్యం నిలువలకు ఏర్పాటు చేసిన మార్కెట్ గోదాంలో, వ్యవసాయ శాఖ కార్యాలయం రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఇందులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆ శాఖల ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఐదు నెలల క్రితమే విద్యుత్ ఏఈ నియామకం

అనుముల, పెద్దవూర, నిడమనూరు మండలాల నుంచి తిరుమలగిరి మండలంలో గ్రామాలు మొన్నటి వరకు ఆయా మండలాల ఏఈల పరిధిలోనే ఉన్నాయి. ఐదు నెలల క్రితం ప్రభుత్వం తిరుమలగిరి మండల కేంద్రానికి విద్యుత్ ఏఈని నియమించింది. ఆ శాఖ కార్యాలయాన్ని ఏర్పర్చుకోవడానికి అద్దె భవనం కూడా మండల కేంద్రంలో దొరకలేదు. దీంతో గత్యంతరం లేక హాలియా విద్యుత్ కార్యాలయంలోనే ఆ అధికారికి చిన్న గదిని ఏర్పాటు చేయడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ప్రతి పనికి హాలియాకు వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించి మండలాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోతుతున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి



తిరుమలగిరి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారని ఎంతో సంతోషించాం. కానీ ఏళ్లు గడుస్తున్నా ఒక్క భవనం కూడా నిర్మించలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.. వారికి ఇబ్బందులు కలుగకుండా నూతన భవనాలు నిర్మిస్తే బాగుంటుంది. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించాలి.

– పుల్లంరాజు, రాజవరం

ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి. అద్దె భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతుండటంతో అధికారులతో పాటు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఇప్పటికైనా సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.

– పగడాల పెద్దిరాజు, గోదుమదక